'ఇఫ్తార్'తో మతసామరస్యం పెంపొందుతుంది

● ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్

బోరబండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఇఫ్తార్ విందులు మతసామరస్యాన్ని పెంపొందిస్తాయని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్‌లోని సయ్యదినా ఉమర్ ఫారూఖ్ మసీద్ వద్ద ప్రభుత్వం తరఫున ఆదివారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందులు గంగా-జమున తహజీబ్‌ను చాటుతాయన్నారు. రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పర్యవేక్షణలో జరిగిన విందులో కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎండీ అసదుద్దీన్, వి.నవీన్‌యాదవ్, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం ముందు చూపునకు నిదర్శనం ఫ్యూచర్ సిటీ

● టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ

బేగంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ప్రతిపాదన సీఎం రేవంత్‌రెడ్డి ముందు చూపునకు నిదర్శనమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డా. కోట నీలిమ అన్నారు. నగరాన్ని నాలుగు వైపులా అభివృద్ధి చేయాలన్నదే సీఎం లక్ష్యమన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో నీలిమ మాట్లాడారు. పట్టణీకరణ, పారిశ్రామికీకరణతో పాటు కార్బన్ రహిత నగరంగా ఫ్యూచర్ సిటీ రూపుదిద్దుకుంటుందన్నారు. స్కిల్ యూనివర్సిటీ రావడంతో యువతకు ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆమె వెల్లడించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పద్మావతి

విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

బేగంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ విద్యా విధానంలో డిజిటల్ టూల్స్‌ను అనుసరించాలని బేగంపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. కె.పద్మావతి సూచించారు. సోమవారం కళాశాలలో యూజీసీ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కార్యశాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లడుతూ.. మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఆధునిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు ఓయూ సెల్ డైరెక్టర్ నాగేష్ మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో విద్యా విధానం ఆన్‌లైన్ ద్వారానే జరిగే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే ఆర్థిక చెల్లింపులు, పరీక్షల మూల్యాంకనం ఆన్‌లైన్‌లోనే జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో ఓయూ ప్రతినిధి రఘుపతి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహ్మత్‌నగర్ కూడలిని విస్తరించాలి

బోరబండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ విభాగాలకు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయి. నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్న రహ్మత్‌నగర్ కూడలిని వెంటనే విస్తరించాలని బీఆర్ఎస్ నాయకుడు పి.వినోద్‌కుమార్ గౌడ్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆయన పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ ఎన్.ప్రసీదకు వినతిపత్రం అందజేశారు. కూడలిలో వ్యాపారాలను ఇటీవల తొలగించడం వల్ల సమస్య కొంతవరకు పరిష్కారమైందని, సాయి వైన్స్‌కు ఎదురుగా ఉన్న దుకాణాలను తొలగిస్తే ట్రాఫిక్ చిక్కులు తొలుగుతాయని ఆయన వినతిపత్రంలో పేర్కొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న వినోద్‌కుమార్ గౌడ్

గంజాయి విక్రేతకు రిమాండ్

బోరబండ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని బోరబండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. బాలానగర్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో నివసించే జనగాం జిల్లాకు చెందిన మేకల తరుణ్‌కుమార్ (28) పెస్ట్ కంట్రోల్ సంస్థ మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తున్నాడు. బోరబండ సైట్-3 కాలనీ పీలీదర్గా సమీపంలో గంజాయి విక్రయిస్తుండగా బోరబండ పోలీసులు దాడిచేసి పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న కిలో గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

మరదలిని వేధిస్తున్న బావపై కేసు నమోదు

బేగంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మహిళను వేధిస్తున్న ఆమె బావపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ హరీష్ తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండకు చెందిన మహిళ (31) జీహెచ్‌ఎంసీలో విధులు నిర్వహిస్తుంది. ఆమెకు 2020లో వివాహం జరిగింది. భర్త, అత్తమామలతో పాటు బావ సంజీవ్‌కుమార్(39) కుటుంబంతో కలిసి ఉమ్మడిగా నివసిస్తుంది. ఈ క్రమంలో సంజీవ్‌కుమార్ తరచూ ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తుండటంతో పుట్టింటికి వెళ్లిపోయింది. విషయం తల్లిదండ్రులకు చెప్పి వారి సహకారంతో సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నిందితుడు సంజీవ్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెలూన్‌తో వాతావరణ వివరాలు..



బెలూన్ ద్వారా వాతావరణ వివరాలను సేకరించేందుకు ఆ శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకోసం దేశంలోని 59 కేంద్రాల్లో భూమి నుంచి 34 మీటర్ల ఎత్తులో ఉదయం, సాయంత్రం బెలూన్‌ను ఎగురవేయనున్నారు. ఇందులో భాగంగా సోమవారం బేగంపేటలో వాతావరణ శాఖ అధికారులు ఓ బెలూన్‌ను గాల్లోకి ఎగురవేశారు. కాగా, దీని కోసం ప్రతి రోజూ రూ.14 వేల ఖర్చు అవుతుందని అధికారులు తెలిపారు.

- హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి)

కోట్లు ఖర్చు చేసినా నిరుపయోగమే

- రూ.2 కోట్లతో నెహ్రూ పార్కు అభివృద్ధి
- పర్యవేక్షణ లోపంతో అధ్వానంగా మారిన వైనం
- వెలగని దీపాలు.. పాడైపోయిన ఆట వస్తువులు
- ఫిర్యాదులను పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

బేగంపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పార్కుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తున్నా అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో అవి ప్రజలకు ఉపయోగపడటం లేదు. సనత్‌నగర్ డివిజన్‌లోని నెహ్రూ పార్కు పరిస్థితి ప్రస్తుతం అలానే ఉంది. గత ప్రభుత్వం సుమారు రూ.2 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపట్టి వాకింగ్ ట్రాక్, హైమాస్ట్ లైట్లు, పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, బొమ్మలను ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునే ప్రాంతంలో వారు కిందపడినా దెబ్బలు తగలకుండా ఉండేందుకు ప్రత్యేకమైన మ్యాట్‌లను వేశారు. దీంతో అప్పుడు పెద్ద సంఖ్యలో పిల్లలు పార్కుకు వచ్చి ఆడుకునేవారు. ప్రస్తుతం మ్యాట్ ధ్వంసమవడంతో పాటు ఆట వస్తువులు పాడయ్యాయి. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాడైపోయిన ఆట వస్తువులు

పిల్లలకు అవసమైన అన్ని ఆట వస్తువులు ఉండటంతో పెద్దలతో పిల్లలు గతంలో పెద్ద సంఖ్యలో పార్కుకు వచ్చేవారు. పెద్దలు వాకింగ్ చేస్తుంటే పిల్లలు సరదాగా ఆడుకునేవారు. అయితే ఆరు నెలల నుంచి పిల్లలు ఆడుకునే జారుడు వస్తువులు ఊడిపోవడంతో నిరుపయోగంగా మారాయి. దీనికి తోడు ఆడుకునే సమయంలో దెబ్బలు తగలకుండా ఏర్పాటు చేసిన మ్యాట్ పూర్తిగా పాడైపోయింది. ఈ విషయాన్ని పార్క్‌కు వచ్చే వారితో పాటు స్థానికులు పలుమార్లు కార్పొరేటర్‌తో పాటు అధికారులకు వివరించినా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. లైట్లు వెలగకపోవడంతో సాయంత్రానికి చీకటిగా ఉంటుంది. దీంతో రాత్రి వేళల్లో పోకిరీలు తిష్ట వేస్తున్నారు. మరోవైపు బోర్ పని చేయకపోవడంతో నీటి సమస్య నెలకొంది. వీటితో పాటు పార్కులో ఏర్పాటు చేసిన సిమెంట్ బెంచీలు విరిగిపోవడంతో వాటిని స్టోర్ రూంలో పడేశారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసినా అధికారుల పర్యవేక్షణ లోపంతో ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు దృష్టి సారించి పార్కులో సౌకర్యాలను మెరుగుపర్చాలని కోరుతున్నారు.



ప్లేయింగ్ జోన్‌లో ధ్వంసమైన మ్యాట్



నిరుపయోగంగా మారిన జారుడు బల్లలు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

నెహ్రూ పార్క్‌లో ఆరు నెలలుగా పిల్లల ఆట వస్తువులు వినియోగంలో లేవు. లైట్లు సైతం వెలగడం లేదు. బోరు పని చేయకపోవడంతో ట్యాంకర్‌పై ఆధార పడాల్సి వస్తోంది. అయితే ఈ విషయాలను ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి నుంచి ఆదేశాలు రాగానే అన్ని సమస్యలు పరిష్కరిస్తాం.

- సంధ్య, సూపర్‌వైజర్, హార్టికల్చర్ విభాగం

టీబీని దేశం నుంచి తరిమికొడతాం

● చెస్ట్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్

ఎర్రగడ్డ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిని నిర్మూలించడంలో భారతదేశం విజయం సాధిస్తుందని, టీబీ హారేగా దేశ్ జీతేగా అన్న నినాదంతో టీబీ మహమ్మారిని తరిమివేయడానికి ముందుకు సాగుతున్నామని చెస్ట్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ అన్నారు. సోమవారం వరల్డ్ టీబీ డేను పురస్కరించుకొని ఎర్రగడ్డలోని చెస్ట్ ఆసుపత్రి ఏఆర్‌టీ సెంటర్లో టీబీ రోగులకు పండ్లు, బిస్కెట్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో 2025 సంవత్సరం నాటికి టీబీని తరిమివేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. అయితే కొన్ని కారణాలవల్ల అది సాధ్యపడలేదని, 2030 నాటికి దేశం నుంచి తరిమికొట్టే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏఆర్టీ సెంటర్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. టీబీ మహమ్మారి నిర్మూలనకు వాలంటీర్లందరూ శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. టీబీ వ్యాధి సోకిన వారు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులను వాడితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. అనంతరం టీబీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ టీబీ అసోసియేషన్ వైస్ చైర్మన్ డాక్టర్ సుధీర్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ బాలచందర్, ప్రొఫెసర్ డాక్టర్ ప్రమోద్ కుమార్, డాక్టర్ గణేష్, రత్నాకర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ శ్రావణ్ కుమార్, డాక్టర్ ప్రమోద్ కుమార్ తదితరులు

శ్రీశైలం బ్యాక్ వాటర్ తరలింపును అడ్డుకోండి

● ప్రభుత్వానికి సూచించిన సామాజికవేత్త అశోక్ కుమార్

పంజాగుట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలకు ముఖ్య నీటి వనరు అయిన శ్రీశైలం జలాలను అక్రమంగా తరలించుకుపోతుంటే రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని నగరానికి చెందిన సామాజికవేత్త, న్యాయవాది కె.అశోక్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏపీలో సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ఏర్పాటు చేసిన విద్యుత్ సంస్థ అనధికారికంగా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను తరలించకుపోతున్నట్లు తమ క్షేత్ర స్థాయి పరిశీలనలో గుర్తించినట్లు తెలిపారు. సదరు సంస్థ సూర్యరశ్మి లేని సమయంలో నీటి ద్వారా కూడా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నట్లు తమకు అనుమానాలు ఉన్నాయని, నీటి ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసేందుకే పెద్ద ఎత్తున నీటిని తరలించుకుపోతుందని ఆరోపించారు. దీనిపై రెండు రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. అక్రమ నీటి తరలింపుతో తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ముఖ్యంగా హైదరాబాద్ మహానగరానికి తాగునీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ప్రయోజనం లేకుండా పోయిందని, ఇప్పటికైనా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి శ్రీశైలం బ్యాక్ వాటర్ తరలింపును అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సామాజిక కార్యకర్తలు కె.సైదారావు, ఎండీ రఫీ, కె.సాయి కుమార్, డి.సాయి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్ కుమార్

కగార్‌తో మానవ హననం, రక్తపాతం

● కేంద్రం, సీపీఐ మావోయిస్టు పార్టీ శాంతి చర్చలు జరపాలి

● పీస్ డైలాగ్ కమిటీ సదస్సులో పలువురు వక్తలు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని కేంద్ర ప్రభుత్వం, సీపీఐ మావోయిస్టు పార్టీ బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలని పలువురు వక్తలు కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీస్ డైలాగ్ కమిటీ (శాంతి చర్చల కమిటీ) ఆధ్వర్యంలో మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ గోపాల్, ప్రొఫెసర్ పీఎల్ విశ్వేశ్వరరావు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కందిమల్ల ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతి, చెరుకు సుధాకర్, న్యాయవాది వెంకన్న తదితరులు మాట్లాడారు. దండకారణ్యంలోని ఆదివాసీ ప్రజలపై, మావోయిస్టు పార్టీపై కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న కగార్ అంతిమ యుద్ధం ద్వారా మానవ హననం, రక్తపాతం జరుగుతుందని వారు వెల్లడించారు. డ్రోన్‌లతో జంబింగ్ చేస్తూ ఎన్‌కౌంటర్ల పేరుతో జరుగుతున్న మారణహోమంలో వందలాది మంది చనిపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలని వారు కోరారు.



వివరాలను సేకరిస్తున్న పోలీసులు

దొంగతనానికి వచ్చి.. భవనం పైనుంచి కిందపడి వ్యక్తి మృతి

అఫ్జల్‌గంజ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ కాంప్లెక్స్‌లో దొంగతనానికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. అబిడ్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలోని మనోరంజన్ కాంప్లెక్స్ రెండో అంతస్తులో అర్ధరాత్రి సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మూసి ఉన్న గదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. అలికిడి రావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో వారు భయంతో వేరే భవనం పైకి దూకేందుకు ప్రయత్నించగా ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి కిందపడ్డాడు. అతడి తలకు, ముఖానికి, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు బేగంబజార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొదట సోషల్ మీడియాలో హత్యగా ప్రచారం కావడంతో అబిడ్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, బేగంబజార్ సీఐ విజయ్‌కుమార్, క్లూస్ టీమ్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

అసెంబ్లీ ముట్టడికి యత్నించిన రైతుల అరెస్ట్

ఖైరతాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జగిత్యాలకు చెందిన కొందరు రైతులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. సోమవారం గన్‌పార్క్ నుంచి ర్యాలీగా బయలుదేరిన రైతులు అసెంబ్లీ గేట్ నంబరు 3 వద్దకు వచ్చి పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ లోనికి చొచ్చుకెళ్లేందుకు యత్నించారు. దీంతో కాసేపు అక్కడ ఉద్రిక్తత చోటుచేసుకుంది. అప్రమత్తమైన పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు వేతనాలు పెంచాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ కోఠిలోని జిల్లా డీఎంఅండ్‌హెచ్ కార్యాలయం వద్ద ఆందోళన చేసిన ఆశావర్కర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నేపథ్యంలోనే కొందరు అసెంబ్లీ వద్దకు చేరకొని నినాదాలు చేయగా పోలీసులు ఆరుగురు ఆశా వర్కర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

సాంకేతికతను అందిపుచ్చుకోవాలి

అల్వాల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నేటి యుద్ధ భూమిలో మనుగడ సాధించాలంటే నూతన సాంకేతికతను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకోవాలని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) అనిల్ చౌహాన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్ సీడీఎంలో హయ్యర్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్-20లో చేరుతున్న అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. భద్రతా సవాళ్లను పరిష్కరించడానికి వేగంగా మారుతున్న సంప్రదాయేతర ముప్పును ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్సీ ద్వారా వర్గీకరించి సాంకేతిక పురోగతిని సాధించే దార్శనిక నాయకత్వం గురించి వివరించారు. దేశ జాతీయ భద్రత వ్యూహాన్ని రూపొందించడంలో భారత సాయుధ దళాల పాత్ర ప్రాముఖ్యతను వివరించారు. సాయుధ దళాల కోసం విజన్ 2047 ఉమ్మడి సిద్ధాంతాలు, రక్షణ, సైనిక విధానాలు రోడ్ మ్యాప్ దృక్పథం గురించి చెప్పారు. ఈ సందర్భంగా జనరల్ అనిల్ చౌహాన్ మిత్రదేశాల అధికారులతో సహా సీడీఎం అధ్యాపకులు, కోర్స్‌లో పాల్గొన్న అధికారులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ కార్యక్రమంలో సీడీఎం కమాండెంట్ హర్ష్ చిబ్బర్, త్రివిధ దళాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కామర్స్ టాలెంట్ టెస్ట్‌కు మంచి స్పందన

ఖైరతాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కామర్స్ అంశాలపై అవగాహన పెంచేందుకు ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ (ఐఐఎంసీ) నిర్వహించిన కామర్స్ టాలెంట్ టెస్ట్‌కు మంచి స్పందన లభించింది. కేపీస్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ సహకారంతో ఆన్‌లైన్‌లో జరిగిన ఈ పరీక్షలో 13 రాష్ట్రాలకు చెందిన కళాశాలల నుంచి 650 మంది డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ చూపిన వారికి నగదు బహుమతులు అందజేశారు. కొద్ది సంవత్సరాలుగా ఐఐఎంసి కామర్స్ టాలెంట్ పరీక్షకు మంచి ఆదరణ లభిస్తోంది. విద్యార్థులను నిష్ణాతులుగా చేసేందుకు తమ కళాశాల కృషి చేస్తోందని, ఇందుకు గాను తమకు ఇటీవలే ఐఎస్ఓ సర్టిఫికెట్‌తో పాటు అటానమస్ స్టేటస్ లభించిందని ప్రిన్సిపాల్ కూర రఘువీర్ తెలిపారు. పరీక్ష నిర్వహణలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ సంతోషి, తిరుమలరావు, ప్రతినిధులు ప్రశాంత్, పరీక్ష కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



ఖైరతాబాద్ నుంచి పంజాగుట్ట వైపు వెళ్లే ప్రధాన రహదారిలో మోడల్ హౌస్ వద్ద ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్ పైకప్పు

- పంజాగుట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి)



స్వరూప, రవికుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న తోటి ఉద్యోగులు

ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించాలి

చిలకలగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించి పని చేసే సంస్థకు మంచి పేరు తీసుకురావాలని మాజీ ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వైజర్ చంద్రప్రకాష్ సూచించారు. సికింద్రాబాద్, ఆర్ఆర్‌సీ ఆవరణలో సోమవారం దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న సీనియర్ సెక్షన్ ఆఫీసర్ కె.స్వరూప రాణి, ఈమని రవికుమార్‌లకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రప్రకాష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీ తనంతో పనిచేయాలని, వారికి పనిపట్ల శ్రద్ధ, నిబద్ధత అవసరమన్నారు. స్వరూప, రవికుమార్‌లను శాలువ, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ మీడియా ప్రతనిధి షేక్ రవూఫ్, మదన్ మోహన్, ఎ.జి.కె.మూర్తి, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్ ప్రకటన నమ్మి మోసపోయాం

● న్యాయం చేయాలని బాధితుల విజ్ఞప్తి

పంజాగుట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల మాదిరిగానే ఓ సెలబ్రిటీని నమ్మి తాము మోసపోయామని, తమకు న్యాయం చేయాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. సోమవారం తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేయడానికి వారు పంజాగుట్ట పీఎస్‌కు వచ్చారు. ఈ సందర్భంగా బాధితులు ఫజల్ అహ్మద్, ఏ.నరేంద్ర మాట్లాడుతూ.. యూట్యూబ్‌లో ప్రముఖ క్రికెటర్ ఒకరు ఓ నిర్మాణ సంస్థకు ప్రమోట్ చేశారని, హైదరాబాద్, బెంగుళూరుల్లో ప్రాజెక్టులు ఉన్నాయని చెప్పారన్నారు. దానిని చూసి ఇంటి నిర్మాణం కోసం అడ్వాన్స్‌గా కొంత డబ్బులు చెల్లించామన్నారు. అయితే ఇళ్లు నిర్మించకపోగా తాము కట్టిన డబ్బులు తిరిగి చెల్లించాలని అడిగితే సంబంధిత నిర్మాణ సంస్థ తమకు చెల్లని చెక్కులు ఇచ్చి మోసం చేసిందని బాధితులు వాపోయారు. మోసగాళ్లు ఇచ్చే డబ్బులకు ఆశపడి సెలబ్రిటీలు సంస్థలను ప్రమోట్ చేసి ప్రజలను మోసం చేస్తున్నారని వారు ఆరోపించారు.



క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా గాంధీలో ర్యాలీ నిర్వహించిన వైద్యులు

క్షయ వ్యాధి నివారణకు మందులు వేసుకోవాలి

● ప్రొఫెసర్ ఇందిరా

అడ్డగుట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధికి తప్పకుండా మందులు వేసుకోవడమే మార్గమని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిరా సూచించారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా గాంధీ మెడికల్ కాలేజీ, గాంధీ ఆస్పత్రి ఆవరణలో వైద్యులతో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణకు క్రమం తప్పకుండా మందులు వేసుకోవడమే మార్గమన్నారు. ప్రతి ఏడాది మార్చి 24న క్షయ వ్యాధి నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సకాలంలో వైద్యం తీసుకోవడంతో పాటు కోర్సును క్రమం తప్పకుండా తీసుకుంటే క్షయ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. క్షయ వ్యాధి గ్రస్తులకు అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా మందులు అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజ కుమారి, మైక్రో బయాలజీ విభాగం ప్రొఫెసర్ సురేఖ, వైద్యులు పూజ, స్వాతి, ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్, పారుక్‌లతో పాటు పీజీ వైద్యులు పాల్గొన్నారు.

ఒకే హాలులో రెండు అంగన్‌వాడీ సెంటర్లు

● ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీ టీచర్

అడ్డగుట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మారేడుపల్లి మహాత్మా గాంధీనగర్‌లో ఉన్న రెండు అంగన్‌వాడీ సెంటర్లు ఒకే గదిలో కొనసాగుతున్నాయి. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అంగన్‌వాడీ టీచర్ సోమవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను తుకారాంగేట్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. అందుకు ఎమ్మెల్యే స్పందించి అంగన్‌వాడీ సెంటర్లలో చదువుతున్న విద్యార్థులు ఇబ్బందులు పడకుండా రెండు సెంటర్లను ఒకే చోటకు మార్చాలని తమకు ఒక కమ్యూనిటీహాలులో ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే కమ్యూనిటీహాలులో అంగన్‌వాడీ సెంటర్లు నడిపేవిధంగా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.



పవర్‌బోర్‌వెల్, హ్యాండ్ బోరులకు మరమ్మతులు చేపట్టాలని మేనేజర్‌కు స్థానికులతో కలిసి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సామల హేమ

మేడిబావిలో నీటి సమస్యలను పరిష్కరిస్తాం

● కార్పొరేటర్ సామల హేమ

బౌద్ధనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మేడిబావిలో నీటి సమస్యలను పరిష్కరిస్తామని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. నీటి సమస్యలపై స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం జలమండలి అధికారులతో కలిసి ఆమె మేడిబావిలో పర్యటించారు. నల్లాల నుంచి మంచినీటి సరఫరా అంతంత మాత్రమే ఉందని, పవర్ బోర్‌వెల్, హ్యాండ్‌బోర్స్ పనిచేయకపోవటంతో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. స్థానికులు తెలిపిన సమస్యలను పరిష్కారించాలని జలమండలి మేనేజర్‌కు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానికులతో కలిసి వినతిపత్రం సమర్పించారు. బ్రాహ్మణబస్తీ, రామాయలంవీధిలో సీవరేజీ సమస్య అధికంగా ఉందని వాటిని పరిష్కారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు దుర్గాప్రసాద్, ఎర్రజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలయని (35-40) సంవత్సరాల వ్యక్తి మృత దేహం లభ్యమైన ఘటన మహంకాళి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంజీ రోడ్డులో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పరశురామ్ తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ శ్రీకాంత్ సోమవారం ఉదయం 8.15 గంటల సమయంలో పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తుండగా ఎంజీ రోడ్డులో అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తి కనిపించాడు. వెంటనే 108 అంబులెన్స్‌ను రప్పించి పరీక్షించగా ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని ట్రాలీలో గాంధీ మార్చురీకి తరలించి భద్రపరిచారు. మృతుడిని ఎవరైన గుర్తిస్తే మహంకాళి పోలీస్ స్టేషన్‌లో సమచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రైలు కిందపడి వృద్ధురాలి ఆత్మహత్య

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ వృద్ధురాలు తల్లిదండ్రుల ఫొటో పక్కన పెట్టుకుని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన అల్వాల్ సమీపంలో చోటు చేసుకుంది. మచ్చబొల్లారానికి చెందిన విజయలక్ష్మి(60) ముగ్గురు కొడుకులు. పెద్ద కొడుకు మనుమడి వద్ద ఉంటుంది. తల్లిదండ్రులు గుర్తుకొచ్చారో ఏమో గానీ ఇంటి నుంచి తల్లిదండ్రుల ఫొటో పట్టుకుని అల్వాల్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్ సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు చేరుకుని రైలు పట్టాల పక్కన ఫొటో పెట్టి సికింద్రాబాద్ వైపు వస్తున్న రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ విషయాన్ని మృతురాలి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పెద్ద కుమారుడు మాట్లాడుతూ అమ్మ ఎందుకు ఆత్మహత్య చేసుకుందో తెలియడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహన్ని కొడుకులకు అప్పగించారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి, లంకల దీపక్‌రెడ్డి తదితరులు

రక్తదానానికి యువత ముందుకు రావాలి: బీజేపీ

బర్కత్‌పుర, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే చింతల రాంచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. రక్తం కొరత వల్ల ఎంతో మంది ప్రాణాలు పోతున్నాయని, ముఖ్యంగా సామాన్య, మధ్యతరగతి వర్గాల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. రక్తదానం మహాప్రాణదానమన్నారు. సోమవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకల దీపక్‌రెడ్డి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దాదాపు వంద మంది యువత రక్తదానం చేయగా లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ వారు రక్తం సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బంగారు శృతి, కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, సి.కృష్ణగౌడ్, ఏడెల్లి అజయ్‌కుమార్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన శిక్షలు

● డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

బోయినపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మార్కెట్ యార్డు ప్రాంతంలో ప్రతిరోజు ఆకతాయిల చేష్టలు మితిమీరిపోతున్నాయని అలాంటి వారిపట్ల పోలీస్‌శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ హెచ్చరించారు. బోయినపల్లి మార్కెట్‌లో ఆకతాయిల గొడవలు అక్రమ పార్కింగ్, రాత్రి సమయాలలో గంజాయి బ్యాచ్‌ల సంచారంతో గొడవలు పెరిగి పోవడంతో ఫిర్యాదుల సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో మార్కెట్ వ్యవహారాలపైన డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ ప్రత్యేక దృష్టి పెడుతూ ఈ క్రమంలో ఆమె రాత్రి సమయాలలో నైట్ డ్యూటీలో బోయిన్‌పల్లి మార్కెట్ ప్రాంతాన్ని పలుమార్లు పరిశీలించి మార్కెట్‌లో జరుగుతున్న అసాంఘిక కార్యక్రమాలను గుర్తించినట్లు తెలిపారు. డీసీపీ ఆదేశాల మేరకు బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌బాబు నేతృత్వంలో మార్కెట్ యార్డు కార్యదర్శి వెంకన్న సారథ్యంలో తిరుమలగిరి పోలీస్‌లు సమావేశాన్ని మార్కెట్ యార్డులోని వ్యవసాయ కళాశాల మీటింగ్ హాల్‌లో ఏర్పాటు చేశారు. హమాలీలు, కమిషన్ ఏజెంట్ల అసోసియేషన్ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో



సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్

నెలకొన్న పలు సమస్యలను వ్యాపారి ప్రభాకర్‌తోపాటు పలువురు రాత్రి వేళల్లో మార్కెట్‌లో వాహనాలు నిలిపి అక్రమ పార్కింగ్‌లు చేయడం, గంజాయి బ్యాచ్‌లు సంచరించడం వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడం, మహిళలు ఒంటరిగా కనిపిస్తే అసభ్యంగా ప్రవర్తించడం ఇలాంటి విషయాలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఒకసారి అయినా డయల్ 100కు సమాచారం ఇచ్చారా అంటూ డీసీపీ వారిని ప్రశ్నించారు. చట్ట వ్యతిరేక పనులు ఏమి జరిగినా ముందుగా 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని, మీరు ఫిర్యాదు చేయకపోతే ఆర్మీని దింపినా సమస్య పరిష్కారం కాదు అని డీసీపీ తెలిపారు.

మార్కెట్ యార్డులో చీకటిగా ఉండే ప్రాంతాలలో పూర్తిస్థాయిలో విద్యుత్ దీపాలను ఏర్పాటుచేసుకోవాలని, అక్కడక్కడ చెక్ పోస్టులు ఏర్పాటు చేసి సెక్యూరిటీని పెంచుకోవాలని అధికారులకు పాలకమండలికి సూచించారు. డీసీపీ సూచనల మేరకు మార్కెట్ యార్డు చైర్మన్ ఆనంద్‌బాబు యార్డులో విద్యుత్ దీపాలు, సెక్యూరిటీ పెంచే విధం గా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ దేవేందర్, పాలకమండలి సభ్యులు, కమిషన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు సోమా దేవేందర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు, ఏసీపీ రమేష్, కార్ఖాన ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

11వేల కుటుంబాల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించా

● కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్

సికింద్రాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని డిఫెన్స్, సివిల్ ఏవియేషన్ భూముల్లో నివసిస్తున్న 11 వేల కుటుంబాలకు శాశ్వత నీడ కల్పించాలని, వారికి కనీస సదుపాయాలు కల్పించాలని అసెంబ్లీ వేదికగా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. 11 వేల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను సోమవారం అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలిపారు. రక్షణ శాఖ స్థలాలైన సాయిబాబా గుడిసెలు, చిన్నక మేళా, నందమూరినగర్, మడ్‌ఫోర్టు గుడిసెలు, 108 బజార్, సెంట్రల్ బ్యాటరీ, రెడ్డి కంపౌండ్, సివిల్ ఏవియేషన్ స్థలాలైన అన్నానగర్, రసూల్‌పురా, ఇందిరమ్మనగర్, శ్రీలంకబస్తీలలో ఉంటున్న ప్రజలకు తరచూ రక్షణ శాఖ, సివిల్ ఏవియేషన్ విభాగాల నుంచి హెచ్చరికలు ఎదురవుతున్నాయని ఆయన చెప్పారు. అందుకే రక్షణ శాఖతో భూ బదలాయింపు చేసుకుని, ఈ స్థలాలను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలని కోరినట్టు పేర్కొన్నారు. తద్వారా 11 వేల కుటుంబాలు నిశ్చింతగా జీవించవచ్చని పేర్కొన్నారు.

భూ బదలాయింపు ప్రక్రియకు సమయం పడితే... అప్పటి వరకూ బస్తీల్లో మంచినీరు, మురుగునీరు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించి, వారంతా ఆత్మగౌరవంతో జీవించేలా చూడాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్టు వెల్లడించారు.

కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య సేవలు

● డాక్టర్ శివనాగ ప్రసాద్

చిలకలగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్లకి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని సోమవారం లాలాగూడ, కేంద్రీయ రైల్వే ఆస్పత్రి, మెడికల్ డైరక్టర్ డాక్టర్. శివనాగ ప్రసాద్‌ని కలిసి ఆల్ ఇండియా రిటైర్డ్ రైల్వే మెన్ ఫెడరేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. సూపర్ సీనీయర్ సిటిజన్స్‌కి క్యూ లైన్ లేకుండా యూయం ఐడి కార్డు లేకపోయిన వైద్యసేవలు అందజేయాలని వినతిపత్రంలో కోరారు. డా.శివనాగ ప్రసాద్ మాట్లాడుతు ఇటీవల సిటీ స్కాన్, ఔషధ మెక్కల పార్కు, క్యాంటీన్, పార్కింగ్ సేవలను జనరల్ మేనేజర్ లాంఛనంగా ప్రారంభించినట్లు త్వరలో క్యాథ్ ల్యాబ్, సెంట్రల్ ఏసీ, నీటి సమస్య పరిష్కారం, భద్రత కల్పించి మెరుగైన సౌకర్యాలు కల్పించి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యసేవలు అందజేయటానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

అనంతరం ఆస్పత్రిలో మెరుగైన సేవల కల్పనకు కృషి చేస్తున్న



శివనాగ ప్రసాద్‌ని సత్కరిస్తున్న ఫెడరేషన్ ప్రతినిధులు

డాక్టర్. శివనాగ ప్రసాద్‌ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఐఆర్ఆర్ఫ్ జోనల్ కార్యదర్శి పి. యగంధర్, సుధాకర్, బాబురావు, నర్సింగరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దొంగతనానికి వచ్చి..

భవనం పై నుంచి కిందపడి వ్యక్తి మృతి

అఫ్జల్‌గంజ్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ కాంప్లెక్స్‌లో దొంగతనానికి వచ్చిన గుర్తుతెలియని వ్యక్తి ప్రమాదవశాత్తు భవనం పై నుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన బేగంబజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఆబిడ్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ సమీపంలోని మనోరంజన్ కాంప్లెక్స్‌లోని రెండో అంతస్తులో అర్ధరాత్రి సమయంలో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మూసి ఉన్న గదిలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా అలికిడి రావడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ వారు పట్టుకునేందుకు ప్రయత్నించారు. వారు భయంతో వేరే భవనంపైకి దూకేందుకు ప్రయత్నించగా ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డాడు. అతడి తలకు, ముఖానికి, కాళ్లకు, చేతులకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు బేగంబజార్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. మొదట సోషల్ మీడియాలో హత్యగా ప్రచారం కావడంతో ఆబిడ్స్ ఏసీపీ వెంకట్‌రెడ్డి, బేగంబజార్ సీఐ విజయ్‌కుమార్, క్లూస్ టీమ్‌లు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ ఘటనపై మరింత లోతుగా విచారించేందుకు సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.



వివరాలను సేకరిస్తున్న పోలీసులు

వేర్వేరు ఘటనలలో ఇద్దరి మృతి

మియాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మీర్జాన్‌పేట్ గ్రామానికి చెందిన అన్నమయ్య పద్మ దంపతుల కుమార్తె భవాని(20) అల్లాదుర్గంకు చెందిన అశోక్‌తో వివాహం జరిగింది. వీరు నగరానికి వచ్చి మియాపూర్ స్టాలిన్‌నగర్‌లో నివసిస్తున్నారు. వీరికి 8 నెలల కుమార్తె ఉండగా, అశోక్ ప్లంబర్ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు భర్త అశోక్ రేషన్ బియ్యం తీసుకు రావడానికి బయటికి వెళ్లాడు. అయితే తిరిగి వచ్చి చూసే సరికి భవాని ఇంట్లో కిటికీకి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికుల సాయంతో తలుపులు బద్దలుకొట్టి కిందకు దింపి చూడగా భవాని మృతిచెంది ఉంది. సమాచారం అందుకున్న మియాపూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి భార్యభర్తల మధ్య మనస్పర్ధలు తట్టుకోలేక తన కుమార్తె ఆత్మహత్య చేసుకుందని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెండవ అంతస్తు నుంచి పడి...

రెండవ అంతస్తుపై నుండి కిందపడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మయూరినగర్ దివ్యశక్తి అపార్ట్‌మెంట్‌లో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం... పి.శ్రీనివాసరాజు (53) అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌నెంబర్ 203లో కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. కాగా వాకింగ్ చేసేందుకు ఆయన బయటకు రాగా, రెండవ అంతస్తు నుండి కిందపడిపోయాడు. అక్కడ స్థానికులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే దగ్గరలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కొంత కాలంగా శ్రీనివాసరాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడని, రెండవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిఉంటాడని భార్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భవాని (ఫైల్)



శ్రీనివాసరాజు మృతదేహం

మధ్య భారతంలో యుద్ధం వెంటనే ఆపాలి

●కేంద్ర ప్రభుత్వం, సీపీఐ మావోయిస్టు పార్టీ శాంతి చర్చలు జరపాలి ● పీస్ డైలాగ్ కమిటీ సదస్సులో వక్తలు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలని, కేంద్ర ప్రభుత్వం, సీపీఐ మావోయిస్టు పార్టీ బేషరతుగా కాల్పుల విరమణ ప్రకటించి శాంతి చర్చలు జరపాలని పలువురు వక్తలు కోరారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీస్ డైలాగ్ కమిటీ (శాంతి చర్చల కమిటీ) ఆధ్వర్యంలో మధ్య భారతంలో జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సదస్సులో ప్రొఫెసర్ హరగోపాల్, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, ప్రొఫెసర్ గోపాల్, ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వరరావు, సీనియర్ కమ్యూనిస్టు నాయకుడు కందిమల్ల ప్రతాపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతి, చెరుకు సుధాకర్, న్యాయవాది వెంకన్న, ప్రొఫెసర్ జయకుమార్, జర్నలిస్టు దుర్గాప్రసాద్, జంపన్న, రాములు హాజరై మాట్లాడారు. దండకారణ్యంలోని ఆదివాసీ ప్రజలపై మావోయిస్టు పార్టీపై కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న కగార్ అనే అంతిమ యుద్ధం ద్వారా మానవ హననం, రక్తపాతం కొనసాగుతుందన్నారు. కాల్పులు ప్రజాస్వామికవాదులు, లౌకికవాదులను, బుద్ధిజీవులను, సామాన్యప్రజలను కలవరపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలని వారు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్



లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యం అందించే విషయంలో నిర్లక్ష్యం చేయొద్దని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం వెస్ట్ మారేడుపల్లిలోని తన కార్యాలయంలో సనత్‌నగర్, మోండా, బన్సీలాల్‌పేట్ డివిజన్లకు చెందిన 7 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2.94 లక్షల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకుని మెరుగైన వైద్యం పొందాలని కోరారు. పేద ప్రజలకు మెరుగైన వైద్యం కోసం తాను అన్ని విధాలుగా అండగా ఉంటానని అన్నారు. కార్యక్రమంలో సనత్‌నగర్ కార్పొరేటర్ కొలన్ లక్ష్మీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు బాల్‌రెడ్డి, హరికృష్ణ, నాగులు, మహేష్ యాదవ్, లక్ష్మీపతి, వెంకట్ బాబు తదితరులు ఉన్నారు.

'జై బాపూ-జై భీమ్-జై సంవిధాన్ అభియాన్' కంటోన్మెంట్ కో ఆర్డినేటర్‌గా కల్వ సుజాత



కల్వ సుజాత

సికింద్రాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ ధ్యేయంగా అఖిలభారత కాంగ్రెస్ కమిటీ దేశ వ్యాప్తంగా చేపట్టిన 'జై బాపూ-జై భీమ్-జై సంవిధాన్ అభియాన్' కంటోన్మెంట్ కో-ఆర్డినేటర్‌గా తెలంగాణ రాష్ట్ర వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత నియమితులయ్యారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను ఆమె మంగళవారం సందర్శించనున్నారు. ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్‌తో కలిసి నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. ఏఐసీసీ చేపట్టిన 'జై బాపూ-జై భీమ్-జై సంవిధాన్ అభియాన్' కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్రంలో దిగ్విజయం చేయాలని, జిల్లాల్లో గ్రామగ్రామాన, నగరాలు, పట్టణాల్లో వీధి వీధిన కార్యక్రమం గురించి అన్ని వర్గాల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ఏడాది పాటు కొనసాగే కార్యక్రమాన్ని విజయవంతం చేయడమంటే... భారత రాజ్యాంగాన్ని గౌరవించడమని, రక్షించడమనే అంశాన్ని పార్టీ శ్రేణులకు వివరిస్తూ, వారిలో ఉత్సాహాన్ని నింపనున్నారు.



స్వరూప, రవికుమార్‌కు ఆత్మీయ వీడ్కోలు పలుకుతున్న తోటి ఉద్యోగులు

ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించాలి

చిలకలగూడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు అంకిత భావంతో విధులు నిర్వహించి పని చేసే సంస్థకు మంచి పేరు తేవాలని మాజీ ప్రిన్సిపల్ ఫైనాన్షియల్ అడ్వయిజర్ చంద్రప్రకాష్ అన్నారు. సికింద్రాబాద్, ఆర్ఆర్‌సీ ఆవరణలో సోమవారం దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్ అకౌంట్స్ విభాగంలో విధులు నిర్వహిస్తు నెలాఖరున పదవీ విరమణ చేయనున్న సీనీయర్ సెక్షన్ ఆఫీసర్ కె.స్వరూప రాణి, ఈమని రవికుమార్‌లకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చంద్రప్రకాష్ మాట్లాడుతు ప్రభుత్వ ఉద్యోగులు జవాబుదారీ తనంతో పనిచేయాలని, పనిపట్ల శ్రద్ధ, నిబద్ధత ఎంతో అవసరమని సూచించారు. స్వరూప, రవి కుమార్‌లని శాలువ, జ్ఞాపికలతో సత్కరించి పాత అనుభూతులు, అనుభవాలు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ద.మ.రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ మీడియా ప్రతనిధి షేక్ రవూఫ్, మదన్ మోహన్, ఎ.జి.కె. మూర్తి, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ మహేందర్‌కుమార్‌రెడ్డికి వైద్యసేవారత్న జాతీయ పురస్కారం అందజేస్తున్న జస్టిస్ చంద్రయ్య, తదితరులు

పురస్కార గ్రహీతలకు మరిన్ని బాధ్యతలు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పురస్కారాలు అందుకున్న వారికి మరిన్ని బాధ్యతలు పెరుగుతాయని జస్టిస్ చంద్రయ్య పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సర్వజన సుఖినోభవంతు సంస్థ 8వ వార్షికోత్సవం, ఉగాది పండగ సందర్భంగా ఉగాది జాతీయ పురస్కారాల ప్రదానం జరిగింది. సంస్థ అధ్యక్షుడు సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జస్టిస్ చంద్రయ్య ముఖ్యఅతిథిగా హాజరై అవార్డులను ప్రదానంచేసి మాట్లాడారు. వైద్య రంగంలో విశిష్ట సేవలందించిన లయన్స్ ఇంటర్నేషనల్, పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ జి.మహేందర్‌కుమార్‌రెడ్డికి వైద్యసేవారత్న జాతీయ పురస్కారం ఇవ్వడం అభినందనీయమన్నారు. పేద ప్రజలకు వైద్యసేవలు అందించడంలో మహేందర్‌కుమార్‌రెడ్డి చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. మహేందర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ వైద్యరంగంలో తాను అందిస్తున్న సేవలకు గాను ఈ అవార్డు ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంఖ్యాశాస్త్ర నిపుణులు దైవజ్ఞశర్మ, ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండడి కృష్ణారెడ్డి, కూచిపూడి నటి భారతి, లయన్ నయనాదేవి, ఉమాశంకర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.